కథానిక:

# నేను ఎవరినైతే నేం!

'వేంకటేశం'

'నేనెందుకు నవ్వుతున్నానో మీ కందరకూ తెలుసుకోవా లని ఉందన్నమాట?'

'చచ్చిపోయేముందు ఎవడన్నా ఎందుకు నవ్వుతా డనేకదూ మీ రనుకొనేది. అవునా?

'నాగురించి మీరేమీ ఆదుర్దా పడబోకండి డాక్టరుగారు. అనవసరంగా శ్రమపడక మీ పనేదో మీరు చేసుకోండి. మీరు ఏవిధంగానూ నన్ను బతికించలేరు. అసలు ఎవ్వరూకూడ నా చావు తప్పించలేరు. ఈ పరిస్థితిలో నన్ను ఎవరూ బతికించలేరు. ఎందుకంటే, నాకు ఒకటి కాదు రెండు బలమైన కత్తిపోట్లు తగిలాయి. ఒకటి వీపుమీద రెండోది డొక్కలోను. కండలు, నరాలు బయటకు రావటం మీకు కనుపించటంలా.........

'మీరంతా నేనెందుకు నవ్వుతున్నానో వినాలని కుతూహలపడుతున్నా రన్నమాట. చచ్చిపోయే వ్యక్తికి నవ్వు తెప్పించే విషయం ఏమిటా అని మీరు ఆశ్చర్యపడుతున్నారుకదూ. నేను చెబుతాను. మీకేమీ ఆదుర్దా పడనవసరంలేదు. ఇప్పుడిప్పుడే కొంచెం జ్ఞాపక మొస్తోంది అసలు నే నెవరినో.........

'మీ రేమిటో గుసగుసలాడుతున్నారే. ఏమిటది? ఎందుకో నవ్వుతున్నారే? నేను చెప్పేనంతా పూర్తిగా విని అప్పుడు గ్రహించండి చచ్చిపోయేముందుకూడ నాకు నవ్వు తెప్పించిన కారణమేమిటో......

'ఇప్పటికి రెండు నెలలనుండి ప్రయత్నిస్తున్నా నే నెవరినో తెలుసుకొంటానికి. ముసల్మానునా, హిందువునా లేక సిక్కునా, బ్రాహ్మడినా లేక అస్పృశ్యుడినా, భాగ్యవంతుడినా లేక పేదవాడినా, నాది తూర్పుపంజాబా లేక పశ్చిమపంజాబా, నా నివాసస్థలం లాహోరా లేక అమృతసరా, రావల్పిండా లేక జలంధరా. నే నెవరినో నిర్ధారణ చెయ్యటానికి నేనే కాకుండా యింకా అనేకమంది శాయశక్తులా ప్రయత్నించారు. నా కుల మేమిటో, నా మత మేమిటో అసలు నా పే రేమిటో తెలుసుకొందా మని అనేకమంది అనేకప్రయత్నాలు చేశారు. కాని ఒక్కరికీ సాధ్యంకాలా. అసలు నే నెవరో నిశ్చయించు కొందామని నేనుకూడ చాల శ్రమపడ్డా. కాని ఫలితం మాత్రం కనుపించలా. ఇప్పుడు కొద్దికొద్దిగా నా పూర్వవిషయాలు గుర్తుకొస్తున్నాయి... యిప్పుడు... చచ్చిపోయే ముందు!...

డాక్టరుగారు! మీరు అంత దీక్షగా నా వంక చూడబోకండి. మీరు ఆ విధంగా చూస్తుంటే నాకు మరీ నవ్వు వస్తోంది. ఊహుం మీరేకాదు, ఈ పరిస్థితిలో నన్ను ఏ డాక్టరూ బతికించలేడు... మీరు ఎందుకు అంత దీక్షగా ఆశ్చర్యంగా నా వంక చూస్తున్నారో నాకు తెలుసు. నా గాయాలను ఎట్లా మాన్పుదా మని ఆలోచిస్తున్నారు కదూ. ఈ రెండు గాయాల్లో ఏ గాయానికి ముందు కట్టు కడతారు. ఒక గాయానికి కట్టు కట్టటానికి ప్రయత్నిస్తుంటే ఒంట్లో ఉన్న నెత్తురు, కండలు, నరాలు రెండో గాయం గుండా బయటకు పోతాయి. ముందు రెండో గాయాన్ని కట్టటానికి ప్రయత్నిస్తే మొదటి గాయంగుండా పోతాయి. కాబట్టి మీ ప్రయత్నాన్ని విరమించి నా కథను, కాదు, నా పూర్వచరిత్రను కొంచెం శ్రద్ధగా వినండి....

రెండు మాసాలపాటు ఢిల్లీ ఆస్పత్రిలో ఉన్న తర్వాత నాకు తెలివొచ్చింది!

'నీ పేరు?' అన్నాడు డాక్టరు.

'నేను చాల ప్రయత్నం చేశాను. కాని 'గుర్తులేదు' అని చెప్పవలసి వచ్చింది.'

'హిందువుడివా లేక ముసల్మానువా?' వెంటనే డాక్టరు యీ రెండో తికమక ప్రశ్న వేశాడు. కాని దీనికికూడ 'గుర్తులేదు' అని చెప్పవలసి వచ్చింది.

'నా పూర్వచరిత్ర ఏమిటో గుర్తులేకుండా పోయింది. నా కులం, నా మతం, నా యిల్లు, సంసారం అన్నీ పూర్తిగా మర్చిపోయా. అసలు నాకు పెళ్లయిందో లేదో, బ్రహ్మచారినో మరి ఎవరినో నాకే అర్థం కాకుండా పోయింది. చివరికి పేరన్నా తెలుసుకొందా మని నా శాయశక్తులా ప్రయత్నించా. పేరు లేకపోతే ప్రపంచంలో నేను ఫలానా వ్యక్తి నని నిరూపించేందుకు ఆధార మెక్కడుంటుందో మీరే చెప్పండి. విచారించగా విచారించగా కొంత కాలానికి తెలిసింది—నే నెట్లా యీ ఆస్పత్రిలోకి వచ్చానో. పంజాబునుండి వస్తున్న కాందిశీకులతోబాటు నన్నుకూడ ఆస్పత్రికి తెచ్చారుట. అట్లా వచ్చినవారిలో చాలమంది ఆస్పత్రిలోనే మరణించారు. ఆ చచ్చిపోయినవాళ్ళు ఏమతస్థులని నేను అడగ్గా హిందువులు, ముస్లింలు, సిక్కులూ—అన్నిమతాలవాళ్ళూ నని ఆస్పత్రివాళ్లు చెప్పారు. అసలు జరిగిం దేమిటంటే లాహోరు అమృతసర్ల మధ్య కాందిశీకులను మోసుకు పోతున్న రెండు రైలుబళ్ళు పట్టాలు తప్పి తల్లకిందు లయ్యాయి. ఒకరైలుబండి పశ్చిమపంజాబునుండి అమృతసరుకు హిందూ కాందిశీకులను మోసుకొస్తోంది. రెండోబండి తూర్పు పంజాబునుండి లాహోరుకు ముస్లింకాందిశీకులను మోసుకుపోతోంది. దాదాపు రాత్రి 11 గం. సమయాన రైలు ఒకవంతెనమీద పోతూ ఉండగా పట్టాలకింద ఒక బాంబు పేలింది. వెంటనే రైలుబండి అమాంతంగా కిందపడి పోయింది. చాలమంది అప్పుడే మరణించారు. చాలమందికి గాయాలు తగిలాయి. గాయాలు తగలకుండా తప్పించుకొన్నవారిని చుట్టుపక్కలలో పొంచిఉన్న గూండాలు తుపాకులు కాల్చి చంపారు. గాయాలు తగిలినవాళ్ళు గుడ్డితనంగా తలోకదారివెంటా పరిగెత్తుకు పోయారు. ఎదురుగుండా వస్తున్న బండికికూడ గంటతర్వాత యిటువంటి ప్రమాదమే సంభవించింది. ఆ రైలుబండిలో గాయాలు తగిలిన వాళ్ళుకూడ తలదాచుకొంటానికి దొరికిన దారివెంబడి పారిపోయారు.

'మరురోజు ఉదయం భారతప్రభుత్వ సేనలు, పాకిస్థాన్ ప్రభుత్వ సేనలు సరిహద్దువెంబడి గస్తీ తిరగటానికివచ్చి అనేకశవాలను, గాయపడి కదలలేకుండా పడిఉన్నవాళ్ళనూ చూశారు. వాళ్లల్లో ఎవరు హిందువో, ఎవరు ముస్లిమో నిర్ణయించటం బహుకష్టమైపోయింది. నేనుకూడ ఆ విధంగా గాయపడిన వాళ్ళల్లో ఒకణ్ణి. నన్ను స్ట్రెచర్ మీద అంబులెన్సుకద్దకు మోసుకొని పోయినవాడు చెప్పాడు నే నెక్కడ ఎట్లా పడిఉన్నానో వివరాలన్నీ. నా గుడ్డలన్నీ నెత్తురుతో తడిసిపోయాయి. నా చుట్టూ ఒకరక్తపు మడుగు తయారైంది. కొత్త సరిహద్దుప్రకారం నా కాళ్ళు పాకిస్థాన్ భాగంలోను, తల భారతదేశంలోను పడిఉన్నాయి. ఈ కొత్త సరిహద్దు వెంట అనేకమతాల, జాతులవారి రక్తం ప్రవహించింది.

'చూడు! మాలానా! ధైర్యాన్ని పట్టించే వాడిమాదిరిగా నా వంక అట్లా చూస్తావేం? నీ మనస్సులో ఏముందో నాకు తెలుసు. నేను యిప్పుడో యింకాసేపటికో చచ్చిపోతాను. చచ్చిపోయేముందు ప్రతివ్యక్తికీ అన్ని విషయాలు తెలుస్తాయి. నేను ముసల్మాను నని చెప్పినట్లయితే యిస్లాం మతమును అనుసరించి నా అంత్యక్రియలు జరుపుదా మని ఆలోచిస్తున్నావుకదూ. ఏమండీ! మహాషాయ్‌జీ! మీ ఆలోచనలు కూడ నాకు తెలుసు. నేను హిందువు నని చెప్పినట్లయితే మీ ధర్మసేవక సంఘాన్ననుసరించి నా అంత్యక్రియలు జరుపుదామని ఆలోచిస్తున్నారు కదూ. బొంబాయిలో పార్శీవాళ్లు శవాల్ని బయట పారేస్తా రని విన్నాను. వాటిని గద్దలు, రాబందులు పీక్కు తింటాయిట, కాని మానవవేషంతో గద్దలు, రాబందులు బ్రతికుండగానే మనిషిని పీక్కు తింటానికి తయారవుతా ఉన్న విషయం నా కింతవరకు తెలియదు.......

'ఇక నా చరిత్ర కొనసాగిస్తా. ఎందుకంటే, నేను మీతో మాట్లాడేకాలం చాలకొద్ది. నాకు తగిలిన గాయాలు ఏమంత బలమైన గాయాలు కావు. రెండువారాలు కట్లు కడితే నయమౌతాయి. కాని నా బుర్రకు గట్టి దెబ్బ తగిలి, మనస్సు చెడిపోయిం దని డాక్టర్లు చెప్పారు. దాని మూలంగా నా జ్ఞాపకశక్తి పోయింది. దాంతో నేను ఒక అనామకుడిగా తయారయ్యా. నా పేరు నేను మర్చిపోయా. ఇంతలో నాలాంటి అభాగ్య కాందిశీకులు చాలమంది ఆస్పత్రి కొచ్చారు. ఆస్పత్రివాళ్లు నన్ను బయటకు వెళ్లమన్నారు. తలదాచుకొనేందుకు చోటైనా దొరక్కపోతుందా అని అన్వేషణ ప్రారంభించా.

'జామ్ మసీదుదగ్గర ఒక శరణాలయము ఉంటే అక్కడకు వెళ్లి కాస్త చోటు యివ్వవలసిందని శరణాలయాధికారిని ఆశ్రయించా'

'నువ్వు హిందువుడివా, ముసల్మానువా?. అని అడిగాడు ఆ అధికారి.

'నాకు గుర్తులేదు' అని చెప్పా. నాకు గుర్తులేని మాట వాస్తవమే. నేను అబద్ధం ఎందుకు చెప్పాలి?

'ఈ శరణాలయం ముసల్మానులకోసం' అని ఆ అధికారి నన్ను బయటకు గెంటాడు.

అక్కడి ఆశ నిరాశ చేసుకొని ఎట్లా గొకట్లా ఢిల్లీకి చేరుకున్నా. ఇక్కడ యిదివరకటి శరణాలయం కంటె పెద్దదాన్ని చూశా. తలదాచుకొనేందుకు కాస్త చోటు యివ్వమని వాలంటీర్లను ప్రార్థించా.

'హిందువుడివా, ముసల్మానువా' అని యిక్కడకూడ అదే ప్రశ్న వేశారు.

'నాకు గుర్తులేదు' అని నేను మళ్లీ ఆ మాటే చెప్పా.

'నీ పేరు?'

'అదికూడ నాకు గుర్తులేదు. అసలు నా కేదీ గుర్తులేదు.

'ఇంకెక్కడి కన్నా వెళ్లు. ఈ శరణాలయం హిందువుల కోసం'.

'ఈ విధంగా ఒక చోటునుంచి యింకో చోటికి తిరిగా. హిందువులకోసం శరణాలయాలున్నాయి. మహమ్మదీయులకోసం శరణాలయాలున్నాయి. కావి మానవులకోసం మాత్రంలేవు.

'ఆ రాత్రి శరీరంబాగా అలవటంచేత నడవటానికి ఓపికలేక ఒక సిక్కు సర్దారు బంగళా ముందు స్పృహతప్పి పడిపోయా. అతడు సెక్రటేరియట్‌లో ఒక చిన్న ఆఫీసరు. అతడు నన్ను లోపలకు తీసుకుపోయి రొట్టె, పాలు యిచ్చాడు. నాకు కొంచెం స్పృహ వచ్చిన తర్వాతగూడ నేను హిందువునో, ముసల్మానునో సిక్కునో నన్ను అడగలా. 'కులాసాగా ఉందా బాబు' అని మాత్రం అడిగాడు.

'అతని బంగళాలో నేచాలరోజులు గడిపా. నేను నా కథను ఉన్నది ఉన్నట్లు చెప్పి నే నెవరినో నాకు తెలియదన్నా అప్పటికిగూడ అతని కుటుంబము నన్ను చాల ఆప్యాయంగా చూసింది. కొన్నిరోజులతర్వాత వారి చుట్టాలు కొంతమంది రావల్పిండినుండిపారిపో యొచ్చారు, ముస్లిం గూండాలచేతిలో వాళ్ళు చాల కష్టాలనుభవించారు. వాళ్ల కళ్లఎదటే వాళ్ల బంధువులను నానాహింసలుపెట్టి అవమానాలపాలు చేశారు. వాళ్ల హృదయాలు ముస్లిములంటే అసహ్యంతో నిండిపోయాయి. ఈ కథంతా విన్నతర్వాత నాకు తెలియకుండా నేనుకూడ ముస్లిములను అసహ్యించుకోవటం మొదలుపెట్టా.'

'సర్దార్ గారు నా కథంతా, నా కే విధంగా మతి పోయిందీ, ఏవిధంగా నేను కష్టాలుపడ్డదీ వివరాలన్నీ ఆవచ్చిన బంధువులకు చెప్పారు. పెద్దవాళ్ళు నన్ను అనునయించి నా పూర్వస్మృతిని తెప్పించటానికి చాల ప్రయత్నం చేశారు. కాని పిల్లలుమాత్రం నన్ను అనుమానంగానే చూశారు. అందులో ఒకడు యింకొకడితో యీ విధంగా చెప్పటం విన్నా: 'వాడు చెప్పిందంతా అబద్ధ మనుకో. మతి తప్పిపోయిం దని బొంకుతున్నాడనుకో. వాడు నిజంగా ముమేమో.' వాళ్ళు ఏమన్నా చేస్తారేమో నని నాకు భయం పుట్టింది.

'ఆ ఆలోచనే నన్నుకూడ వేధించుకు తింది. నేను నిజంగా ముస్లిము నేమో. ఏమో ఎవరికి తెలుసు. నేనుకూడ యిప్పుడు 'ముస్లిములు చేస్తున్నమాదిరిగా ఘోరాలు చేసినతర్వాత నాకు మతి తప్పిందేమో. నా ఘోరకార్యాలకి భగవంతుడు న న్నీవిధంగా శిక్షించా డేమో.' ఆ రోజు రాత్రే సర్దార్ యింటినుండి పారిపోయా. తిరిగి వీథులవెంట తిరుగుతున్నా. మళ్లా ఉపవాసాలు.

'ఈ శరణాలయం ముస్లిములకోసం'

'నీ వెవరు?'

'నీ పే రేమిటి?'

'నీ మత మేమిటి?'

'నువ్వు ఎక్కడనుండి వస్తున్నావ్?'


ప్రశ్నలు! ప్రశ్నలు!! ప్రశ్నలు!!!

-అన్నీప్రశ్నలు, ఎక్కడచూచినా ప్రశ్నలు.

'నేను అందుల్లో ఒక్కదానికీ సమాధానం చెప్పలేను. ఎందుకంటే నే నెవరినో నాకే గుర్తులేదు. ఇక నడవలేక ఆకలి మండుకుపోతుంటే తిరిగి జామ్‌మసీదు దగ్గరకు పోయి అక్కడే కూచున్నా. ఆకలితో చచ్చిపోవటం నిశ్చయమనుకొన్నా. స్పృహతప్పి పడిపోయా. అట్లా ఎంతసేపు పడిఉన్నానో! ఎప్పుడో ఒక్కసారి మాత్రం కళ్ళు తెరిచేసరికి నా ఎదురుగా ఎనిమిదేళ్ల పిల్లాడు నుంచొని 'లే! లే!!' అని అదే పనిగా అంటున్నాడు. 'ఇదిగో! యివ్వి తిను. మా అమ్మ నీకోసం పంపింది'. తిండి అన్న మాట వినంగానే లేవా లని బుద్ధి పుట్టిం దనుకొంటా. కాని లేవటానికి శక్తి ఎక్కడేనుండి తేను? ఆ పిల్లాడి సహాయంతోనే అతిప్రయాసతో లేచి కూచొని చపాతీలు తింటం ప్రారంభించా. ఎంత రుచిగా ఉన్నాయి ఆ చపాతీలు. భగవంతుడే నాకోసం అమృతాన్ని యీ రూపంలో పంపించినట్లుగా ఉంది. 'చిరకాలం జీవించునాయనా' అని దీవించా. కాస్తముక్కకూడ విడలకుండా అన్నీ తినివేశా. కృతజ్ఞత తెలియ జేద్దా మని అతని చెయ్యి తాకగానే 'నీకు బాగా జ్వరంగా ఉందే!

(22 వ పేజీ చూడుడు)


## రాళ్లు అమర్చిన లివరు వాచీలు



అన్నివాచీలు స్విట్జర్లండులో తయారైనవి. సరిగా టైం చూపును. గట్టి మెషినరి, మన్నికగలవి. అందమైన ఆకారము. ప్రతీదీ 7 ఏండ్ల గ్యారంటి. క్రోమియం కేసు రు 18/8- మేలురకం రు 21/- 4 రాళ్లు రెక్టాంగ్యులర్ షైప్ క్రోమియం కేసు రు 33/- 7 రాళ్లు రు 38/- మేలురకం రు 41/- 15 రాళ్లు క్రోమియం కేసు రు 61/- రోల్డు గోల్డు 10 ఏళ్లు గ్యారంటి 7 రాళ్లు రు 48/- మేలురకం రు 52/- ఆడవాళ్లకు రు 66/- 15 రాళ్లు రోల్డు గోల్డు రు 82/- పోస్టేజి 12 అణాలు. రెండు వాచీలకు పోస్టేజి ఉచితము. క్యాటలాగులు అయిపోయినవి.

### యు. ఎస్. ఎ. ఫౌంటెన్ పెన్ను

అనేకరంగులలోను డిజైనులలోను దొరకును. ధర రు 3/8- మీడియం రు 4/8- సుపీరియర్ రు 5/8- బెస్ట్ రు 7/8- గోల్డు ప్లేటెడ్ పాళీ ఎక్స్ట్రా 6 అణాలు. సుపీరియర్ రు 1/- 14 క్యారట్ రు 2/- క్యాటలాగులు అయిపోయినవి.

**THE MODERN WATCH CO., (A P)**
Post Box No. 12220, Calcutta 5.

## నెరసిన వెంట్రుకలఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో. డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచమైయుండిన రూ 2-8-0; మధ్యరకమై యుండిన రూ 3-8-0; పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:-ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

**Shri Behar Ayurvedic Pharmacy**
**(A.M.) P. O. Begu Sarai(Monghyr)**

# నేను ఎవరినైతేనేం!

(11-వ పేజీ తరువాయి)

మా యింటికి పోదాం. మా నాన్న యునాని వైద్యుడు. మందేస్తాడు. తగ్గిపోతుంది.' అని ఆ పిల్లాడు నన్ను వాళ్లయింటికి లాక్కుపోయాడు.

ఆ యునానీ వైద్యు డొక ముసల్మాన్. రోజుకు ఐదుసార్లు నమాజుచేస్తాడు. బీద, బిక్కికి ఉచితంగా మందు లిస్తాడు. అతనికి హిందువులు, ముస్లింలు, సిక్కులు అన్న వివక్షత లేదు. ఎవరు జబ్బుతో వస్తే వారందరికీ మందులిస్తాడు. హకీంసాహెబు మందులవల్ల నా జ్వరము తగ్గింది కాని అంత పెద్ద వైద్యుడివద్దకూడ నా పూర్వ స్మృతిని తెప్పించే మందు లేకపోయింది. నా కథంతా ఆయనతో చెప్పి 'ఒకవేళ నేను హిందువు నేమో. నేను మీ యిల్లు వదలి ఇంకో చోటికి పోవాలి' అని అన్నా. కాని హకీం సాహెబు నన్ను అక్కడే ఉండమని బలవంతం చేశాడు. 'నీవు హిందు వయితేమాత్రం ఏ మొచ్చింది? హిందువులు మాత్రం మనుష్యులు కారూ?'. నే నక్కడే కొంత కాల మున్నా.

ఒక రోజున హకీం సాహెబు కొడుకు నా మాదిరి దురదృష్ట వంతులకు రొట్టెలు యివ్వటానికి వెళ్లి తిరిగి యింటికిరాలా. నేను, హకీం సాహెబు అతనికోసం ఆ రోజల్లా వెతికాం. కాని అతని జాడ తెలియలా. జామ్ మసీదు దగ్గర హిందువులు చంపా రని రాత్రి తెలిసింది. ఈ వార్త వినంగానే హకీం సాహెబు కుటుంబ మంతా దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. ఆ పిల్లాడి భూతం నన్ను రాత్రి, పగలూ వెంటాడుతూ తన మృదుమధురవచనాలతో 'నువ్వు చచ్చిపోతున్నప్పుడు నీవు తిండిపెట్టా. కాని, నువ్వు నన్ను చంపేశావు. గుర్తుంచుకో!' అంటోంది. నేను చంపలే దని నాకు తెలుసు. కాని నేను హిందువునేమో. మతి దప్పక పూర్వం నేనుకూడ అనేకమంది ముస్లిం పిల్లలను చంపానేమో, ఈ ఆలోచన నన్ను అక్కడ నిలవనియ్యలా! ఆ రోజు తెల్లవారు ఝామున ఇంట్లో ఎవళ్లూ లేవకముందే బయటకు పారిపోయా.

'అవి, ఢిల్లీలో మృత్యుదేవత తన సహస్ర బాహువుల్నీ జాపుతూ కరాళనృత్యం చేస్తున్న రోజులు. పట్టపగలే సామాన్యప్రజానీకం మృత్యువువాత పడుతోంది. ఇళ్లు అగ్నిహోత్రుడిపా లవుతున్నాయి. ఏదో ఒకవిధంగా గూండాలను తప్పించుకొని రైలుస్టేషనుకి చేరుకొన్నా. ఇక్కడికన్న బొంబాయిలో కొంచెం ప్రశాంతంగా ఉంటుందని విని అక్కడకు బయలుదేరా. నా పక్కన పంజాబునుండి వస్తున్న ఒక కాందిశీకుడు విన్నబోయిన వదనంతో కూచున్నాడు. రైలు కదిలిన కొంతసేపటికి 'ఎవరునీవు?' అని అడిగాడు. 'నాకు తెలీయదు. హిందువునైనా కావచ్చు. ముస్లిమునైనా కావచ్చు.'

'ఈ మార్గంగుండా ముస్లింలు ప్రయాణం చేస్తే ఘోర ప్రమాదాలకు గురి అవుతా రని విన్నా. నీకు గడ్డం ఉంది. అందుకని అడిగా!

'నేను నా కథ అంతా అతనికి వినిపించా. అతడు నా గడ్డాన్ని దీక్షగా పరిశీలిస్తూ నావంక అనుమానంగా చూస్తున్నాడు.

'వారం రోజులనుండి గడ్డానికి కత్తి తగలక పోవటంచేత గడ్డం కొంచెం పెరిగింది. ఏదో పిచ్చాపాటి మట్లాడుకుంటూ భరతపురం వచ్చాం. అక్కడ రైలు ఆపివేయబడింది. ముసల్మానులు అని అనుమానం వేసినవారి నందర్నీ రైలులోనుండి బయటకు లాగి కాల్చి చంపేస్తున్నారు.

'ఆ విషయాన్ని తలుచుకొంటుంటే నాకిప్పటికీ నవ్వు వస్తోంది. ఎందుకు నవ్వు వస్తోందో మీకు తెలుసుకోవా లని ఉందా? ఆ విధంగా ముసల్మానులను బయటకు లాగి కాల్చి చంపే వాళ్ళంతా 'మహాత్మా గాంధికి జైయ్'అని అరుస్తున్నారు. అది చాలు చచ్చిపోయేముందు ఎవడైనా నవ్వటానికి.

'వాళ్ళు మా బోగీదగ్గరకు రాగానే నాకు కూడ చావు తప్ప దనుకొన్నా. నేను ముస్లిమును అవునో కాదో నాకుమాత్రం తెలియదు. కాని నాకు గడ్డం ఉంది. అది చాలు నన్ను చంపటానికి. నన్ను వాళ్ళు చూడకముందే నాపక్కన యిందాకటినుండి కూచున్న పంజాబీ నామీద దుప్పటివేసి నన్ను పూర్తిగా కప్పేశాడు. వాళ్లు అడగంగానే 'ఆయన మా అన్నండి. లాహోరులో బాగా గాయాలు తగిలాయి. ఇప్పుడు మాట్లాడే పరిస్థితిలో లేడు' అని నా పంజాబీ స్నేహితుడు చెప్పాడు.

'ఏదో ఒకవిధంగా చివరకు బొంబాయి చేరుకొన్నా. ఇక్కడకూడ అదే ప్రశ్న ఎదుర్కొంది— నువ్వు హిందువుడివా, ముస్లిమువా ?.

'ఎవరు హిందువు ? ఎవరు ముస్లిము? అన్న ఆలోచన నాకు యిప్పుడు తట్టింది. నేను ముస్లిముగా కనుపించినప్పటికీ పంజాబీ నన్ను కాపాడాడు. అతను హిందువా? లేక హకీం సాహెబు కొడుకును చంపిన కిరాతకులు హిందువులా? ఎవరు ముస్లములు? హకీం సాహెబు కుటుంబం ముస్లిము కుటుంబమా, లేక రావల్పిండిలో సిక్కులను నానా బాధలుపెట్టిన రాక్షసులు ముస్లిములా? ఎవరు సిక్కులు? సర్దార్ సాహెబు కుటుంబమా లేక ఢిల్లీలో వీరవిహారం చేస్తున్న నీచులా ? ఎవరు ముస్లిం? ఎవరు హిందువు? ఎవరు సిక్కు? ఈ పవిత్రస్థలములో కూడ నువ్వు హిందువువా, ముస్లిమా, సిక్కా అన్న ప్రశ్నే ?!

'నే నెవర్ని? హిందువునా? ముస్లిమునా?'

'రాత్రిం బగళ్లు యీ ప్రశ్న నన్ను బాధించింది. నిద్రపోతున్నప్పుడుకూడ యీ ప్రశ్న భూతాల రూపందాల్చి బల్లాలు పుచ్చుకొని జవాబు పొందటానికి ప్రయత్నించాయి. నేను కలవరింతగా యీ మాట అన్నానేమో. 'నన్ను వదలివెయ్యండి. నేను ముసల్మానునుకాదు. హిందువునూకాదు. సిక్కునూకాదు. ఒక మానవుణ్ణి మాత్రమే!

'బొంబాయిలో కాందిశీకులకు శిబిరాలున్నాయి. సిక్కులకు ఖాల్సా కళాశాల దగ్గర ఒక శిబిరం ఉంది. హిందువులు రామకృష్ణ ఆశ్రమంలో తలదాచుకో వచ్చును. ముస్లింలు అంజుమన్ ఇస్లాం హైస్కూలుకు పోవచ్చును. కాని నేను ఎక్కడకు వెళ్లను? నాకు తలదాచుకొనేందుకు ఎక్కడా చోటు లేదు.

ముష్టికూడ నా కెవళ్లూ వేసేవాళ్లు కాదు. ముష్టి వేసేందుకు గూడ నేను మతంవాడినో అడిగేవాళ్లు. నేనేం చెప్పేది? నేను ఏ మతానికీ సంబంధించిన వాడిని కాను. అయితే నేను చచ్చిపోవాలన్నమాట. ఉహూఁ. ఆవిధంగా చావలేను. నేనెవరినో తెలుసుకోవాలి. లేకపోతే నేను బతకటానికి అవకాశం లేదు.

డాక్టరు 'సమాని' నా స్మృతిని తెప్పిస్తాడని విని అక్కడకు వెళ్లా. అతడు మందులు, మాకులు వేసి రోగం నుదర్చడు. ఊరికే మాట్లాడి కుదురుస్తాడు. 'నీ మనస్సును కష్టపెట్టుకోకు. నీబుర్రలో ఏమొకిస్తే అంతా చెప్పు. సంబంధ మున్నా సరే లేకపోయినాసరే' అనిచెప్పి తను ఒక కాగితం కలం పుచ్చుకొని నా ముందు కూచున్నాడు. నేను కళ్ళు మూసుకొని నానోటికొచ్చిందల్లా మాట్లాడా.

'నీలపు ఆకాశం, పచ్చనిచేలు'

'బాగుంది, ఆపబోకు'

'నీలపు ఆకాశం, పచ్చనిచేలు, ఒక నదీ ప్రవాహం. నదిలో పడవలున్నాయి. ఒక కాలవ. కాలవలో పిల్లలు యీదుతున్నారు. ఒకళ్లమీద ఒకళ్ళు నీళ్లు చల్లుకుంటున్నారు.'

'ఎవరీ పిల్లలు ? హిందువులా, ముస్లిములా, సిక్కులా'

'ఏమో, ఎవరో. కానివాళ్ళుమాత్రం పిల్లలు'

'సరే, కానీ'

'పంటపొలం, పండగ. ఆగు! ఆగు!! డోలక్ వాయిద్యం విను. ఆహాఁ. ఎంత బావుందో ఆహాఁ! ఏంపాట. !!!'

'ఎవరు పాడుతున్నా రా పాట?'

'స్త్రీలు'

'సరే. ఎవ రా స్త్రీలు. హిందువులా, ముస్లిములా, సిక్కులా.'

'పంజాబు స్త్రీలు. హిందువులు, ముస్లిములు సిక్కులు'

'ఊఁ'అని నిట్టూర్చాడు డాక్టరు యికలాభం లే దన్నట్టు.

'ఇక నేనేం చెప్పలేను. నా కేం వినిపించటంలా'

'ఏం? ఎందుకని? ఏ మొచ్చింది ?'

'నాతల తిరిగిపోతోంది. ప్రపంచమంతా చీకటిగా ఉంది. భయంకరమైన కేకలు వినిపిస్తుయి.'

'గట్టిగా ప్రయత్నించు. ఇప్పుడేం కనిపించటంలా?'

'కనిపిస్తున్నాయి. ఆకాశాన్నంటే మంటలు. ఇళ్లన్నీ తగలబడి పోతున్నాయి. ఏడుపు స్వరాలు వినిపిస్తున్నాయి.

'సరే, గూండాలు వచ్చారన్నమాట. వీళ్ళే నీ బంధువుల్ని చంపేశారు. వీళ్ళే నీ ఆస్తి అంతా దోచేశారు. వీళ్ళే నీ పెళ్లాం పిల్లల్ని చంపేశారు. నీ మతి పోగొట్టారు...వా ళ్ళేం చెబుతున్నారు?'

నా కేమీ వినిపించటంలా. అంతా గోలగా ఉంది. ఒక్క మాటమాత్రం చెవులో గుద్దినట్లువినిపిస్తోంది.

'చంపు చంపు చంపు.'

'వీళ్ళే నిన్ను సర్వనాశనం చేశారు. వీళ్ల మీద నువ్వు పగతీర్చుకోవాలి.'

నేను హిందువునో, ముసల్మానునో డాక్టరు తెలుసుకో బోతున్నాడు!

నేను ముస్లిముని: సర్దార్ సాహెబు బంధువుల్నిచంపా. అనేకమంది హిందువుల సిక్కుల ప్రాణాలు తీసివేశా.

నేను హిందువుని. హకీం సాహెబు కొడుకుని చంపా. ఇంకా అనేకమంది ముస్లిములను చంపా.

'వద్దు. అక్కర్లేదు. నే నెవరినో నేను తెలుసుకో నక్కర్లా. నేను హిందువుగాని, ముస్లింగాని, సిక్కుగాని అవదల్చుకోలా. నేను ఒక మానవుడిగా మాత్రమే ఉంటా. అంతే! అంతే!!' అని అరుస్తూ డాక్టరు దగ్గరనుండి పారిపోయా.

'నేను హిందువుని. నేను ముస్లిముని.'

'నేను ముస్లిముని హిందువుని'

'నే నెవర్నీ. నాకేం పనీ'

'నే నెవర్నికాదు. నాకేం పని లేదు'

'నేను హిందువుని ముస్లిముని'

ప్లేగునుండి పారిపోయినట్టు డాక్టరు దగ్గర నుండి పారిపోయా. కాని యీ మాటలు మాత్రం నన్ను వదలిపెట్టలా! నేను ఏ వీధిగుండా పరుగెత్తుతున్నానో నాకు తెలియదు. భయంకరంగా వ్యక్తి ఒకడు నన్ను పట్టుకు ఆపాడు.

'ఆరే సాలా! ఎవఁరా నువ్వు? ఎక్కడికి పోతున్నావ్ ?'

అత డొక ముస్లిం మావాలి. అతని చేతిలో కత్తి ఉంది. 'నేను నా సమస్యతోనే కొట్టుకొంటున్నా. "నేను హిందువుని. 'నేను ముస్లి.......' 'ముస్లిము' అన్నమాట పూర్తి చేయకముందే నా వీపులో బాకు దిగిపోయింది. అదే వీపులో ఉన్న బాకు పోటు!

'కాఫిర్ కా బచ్చా' అని అంటున్నాడు. నేను పూర్తిగా పడిపోకుండా పారిపోతున్నప్పుడు. నా వెనుక రక్తం కారుతోంది. మీరు నమ్మరు. అయితే నమ్మబోకండి. చచ్చిపోయేముందు నేను నిజం మాట్లాడుతున్నా నని నాకు మీరేమీ సర్టిఫికేట్ యివ్వనక్కర్లా......

'నేను ముస్లిముని. నేను హిందువుని' అని అనుకుంటూనే,పోతున్నా. ఈసారి 'హిందువు' అంటానికి పూర్వం నా డొక్కలో ఒక బాకు దిగింది.

'ఇప్పుడు మీరు గ్రహించా రనుకొంటా, నాకీ రెండు గాయాలు ఎట్లా తగిలాయో. నన్ను హిందువులు, ముస్లిములు యిద్దరూ బాకుతో పొడిచారు. అందుకనే మీరు నన్ను బతికించలేరని చెప్పింది డాక్టరుగారు.

ఇక్కడ యింత ఆదుర్దాగా చూస్తున్న మీలో ఒక్కడుకూట నన్ను బతికించలేరు. పగ తీర్చుకొంటానికి మాత్రం నా చావును ఆధారంగా తీసుకొంటారు. ఇప్పుడు గనక నేను హిందువునని చెప్పినట్లయితే వెంటనే హిందువులు నాలుగు అమాయకముస్లిం పిల్లల ప్రాణాల్ని ఆహుతి గొంటారు. ముస్లిము నని చెబితే ముస్లిములంతా హిందూ మతాన్ని రూపు మాపేస్తారు.

'నేను నవ్వుతున్న దెందుకంటే, యిప్పుడే తెలిసింది నే నెవరినో? ఇంత కాలానికి యిప్పుడు తెలిసింది. నా పూర్వచరిత్రంతా గుర్తుకొచ్చింది.......అందాల రాణి నా భార్య. నా బిడ్డడి చిలిపి చేష్టలు. ఇద్దరుకూడ నా కళ్ల ఎదటే చంపబడ్డారు. ఆ విధంగా నా మతి దప్పింది. ఆఁ! అవును! అంతా నా కిప్పుడు గుర్తు కొస్తోంది. మా పొలాలు, మా గ్రామం, నా స్నేహితులు, నా యిరుగు పొరుగువాళ్ళు-అంతా యిప్పుడు జ్ఞాపక మొస్తున్నారు. చచ్చిపోయేముందు అన్ని విషయాలు గుర్తుకొస్తాయి. నిజం!

'మీరు నేనేమి చెబుతానో అని యింకా నిరీక్షిస్తున్నారు. కాని లాభం లేదు. నేను చెప్పను నేను హిందువునో, ముసల్మానునో చెప్పను చెప్ప దలచుకోలేదు. నాకు యీ రెండు గాయాలు తగిలించిన హిందువుగాని, ముస్లింగాని నేను తన జాతివాడి నని తెలుసుకోకూడదు. అరే పొరబాటున పొడిచానే అని పశ్చాత్తాపం పొందకూడదు. ఇదే నా పగ. వీ ళ్లిద్దరిమీదే కాదు. నాలాంటి అమాయకప్రాణాలను బలిగొంటున్న వేలకొలది హిందువులమీద, ముస్లిములమీద, సిక్కులమీద వీళ్ళు పుట్టటం మూలంగా, బతకటం మూలంగా ఆత్మీయమైన నా పంజాబుకు తీరని కళంకం వచ్చింది.

'నేను హిందువునా, ముస్లిమునా ?' 'నేను ముస్లిమునా హిందువునా?' ఈ ప్రశ్నే వాళ్లకు కావాల్సింది. ఈ ప్రశ్నే వాళ్లను రాత్రింబగళ్లు వేధించుకు తినేది. పట్టణంలోను, పల్లెలోను, ఫ్యాక్టరీలోను, బస్సులోను, ట్రాములోను ఎక్కడబడితే అక్కడ యిదే ప్రశ్న. 'వాడు హిందువా, ముస్లిమా?' వాళ్లకుగాని వాళ్ల పిల్లలకుగాని, వాళ్ల పిల్లల పిల్లలకుగాని శాంతిఅంటే ఏమిటో తెలియదు.

భయంకరం, ఘోర భయంకరం నా పగ. 'ఇంకా మీకు తెలుసుకోవా లని ఉందా, నే నెందుకు నవ్వుతున్నానో ?'

[అబ్బాస్ కథకు అనువాదం]


కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో, రాజమండ్రి

భారతప్రశస్తి




స్త్రీల ఆరోగ్య భాగ్యానికి
లోధ్ర
కేసరికుటీరం లిమిటెడ్, మద్రాస్

ఒరిస్సా, నైజాముదామినియమ్ను, ఆంధ్రజిల్లాల తమిళనాడులకు ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు,
బరంపురం, సికింద్రాబాదు, బెజవాడ, మదుర
(Jai Hind Publicity)